క్లుప్తంగా

దరఖాస్తు గడువు పొడిగింపు

దేవరకొండ : మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన వారు ఈనెల 19లోగా డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి దరఖాస్తు చేసుకోవచ్చని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి దరఖాస్తు తేదీని పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందుకుగాను ఈనెల 19న సాయంత్రం 5గంటల లోగా మున్సిపల్‌కార్యాలయం, తహసీల్దార్, కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తు ఫారాలు అందించాలని ఆయన కోరారు. వెరిఫికేషన్ అనంతరం అర్హులైన లబ్ధి దారుల జాబితాలో చేర్చనున్నట్లు తెలి పారు.

ఆర్థిక సాయం అందజేత

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని యల్లాపురం గ్రామానికి చెందిన బద్దెల నాగరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆ కుటుంబానికి హాలియా ఫర్టిలైజర్ దుకాణ, కంపెనీ ప్రతినిధులు అండగా నిలిచారు. గురువారం నాగరాజు కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సాయం అందజేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి, యాదవ్, వెంకన్న, నాగార్జునరెడ్డి, అశోక్, సురేష్ పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం చైర్మన్‌గా వెంకన్న

మిర్యాలగూడ : వేములపల్లి మండలంలోని ఆమనగల్లు నల్ల చెరువు మత్స్య సహకార సంఘం చైర్మన్‌గా మద్దెబోయిన పెద్ద వెంకన్న ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కె.సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికలో పెద్ద వెంకన్న మూడు ఓట్ల మెజార్టీతో గెలుపొందగా కార్యదర్శిగా ఉత్తెర్ల జానకిరాములు, ఉపాధ్యక్షుడిగా చెన్నబోయిన శ్రీనులు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అనంతరం పేరబోయిన ఆంజనేయులు చింతకాయల వీరేందర్, మారిపెద్ది సైదమ్మ, వెంకటయ్య, నాగమ్మలు డైరెక్టర్లుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్య కార్మికుల సమస్యల పరిష్కారానికి తమవంతుగా కృషిచేస్తామన్నారు.

కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలి

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి కార్మికుడు ఇప్పటి నుంచే సమన్వయంతో కృషి చేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్నగౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో గల ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా అంబటి సోమయ్యను నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి ఆదేశాల మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్న గౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, తెలంగాణ పీసీసీ సభ్యుడు కృష్ణయ్యలు ఎన్ఎస్‌పీ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు పి.వెంకన్న, శ్రీనివాస్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

అడవిదేవులపల్లి : సొంత ఇంటి స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు తక్షణమే మంజూరు చేయాలని కోరుతూ గురువారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ రఘుకు వినతిపత్రం అందజేశారు. దరఖాస్తులు చేసుకున్న ప్రతి ఒక్కరికి తెల్లరేషన్ కార్డులు, వితంతువు, వికలాంగులు, ఒంటరి మహిళ పింఛన్లు ఇవ్వాలన్నారు. అదే విధంగా అర్హులైన వారిందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సర్వయ్య, శివ, మునీ, రాంబాబు, పవన్, బిచ్చనాయక్, బాబావతి, సీపీఎం మండల కార్యదర్శి సైదులు పాల్గొన్నారు.

‘బెజ్జం సాయి సస్పెన్షన్ సరైంది కాదు’

మిర్యాలగూడ టౌన్ : ఎంపీటీసీ ఫోరం జిల్లా కార్యదర్శి బెజ్జం సాయిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడం సరైంది కాదని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా రెండు సార్లు ఎన్నికైనా కేతావత్ శంకర్‌నాయక్ నాటి నుంచి నేటి వరకు కూడా కాంగ్రెస్ పార్టీలో ఎస్సీ, ఎస్టీలకు సరైనా ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో మాలమహానాడు నాయకులు బొప్పాని నగేష్, తాళ్లపల్లి సురేష్, జోసఫ్, కరుణాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

దేవరకొండ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. గురువారం దేవరకొండ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా సరఫరా అవుతున్న బియ్యం ఏ మాత్రం నాణ్యత లేకున్నా తిరిగి పంపించాలని ఆయన సూచించారు. మధ్యాహ్న భోజన పథ కం కింద పాఠశాలకు చేరుతున్న బియ్యం సరఫరాపై ఆయన ఆరా తీశారు. విద్యార్థుల ఆహార ప్రమాణాలలో రాజీ ప్రసక్తే లేదన్నారు. పదో తరగతి విద్యార్థులు పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు,రెబెకా తదితరులు ఉన్నారు.

వీధి వ్యాపారులకు భరోసా!

- పీఎం స్వనిధికి నిధులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం
- పెరగనున్న రుణపరిమితి
- హాలియాలో 990మందికి చేకూరనున్న లబ్ధి
- మొదటి, రెండు విడతల్లో చెల్లించిన వారికే అవకాశం


పండ్లు విక్రయిస్తున్న వీధి వ్యాపారి

హాలియా : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మున్సిపాలిటీ చిరు వ్యాపారుల అభ్యున్నతికి పెద్ద పీట వేసింది. ప్రధానమంత్రి స్వనిధి(ఆత్మనిర్భర్) పథకానికి నిధులు కేటాయించింది. దీంతో రుణపరిమితి పెరగనుంది. దీంతో వారికి మరింత భరోసా కలిగనుంది. రూ.వేల అద్దెలు, రూ.లక్షల్లో అడ్వాన్సులు చెల్లించలేక రహదారుల వెంట చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్న వారికి ఆర్థికంగా మరింత చేయూత నిచ్చేందుకు కేంద్రం బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించింది.

కోవిడ్ నేపథ్యంలో చేయూత

మూడేళ్ల కిందట కోవిడ్ కారణంగా లాక్‌డౌన్ విధించడంతో రోజూ ఫుట్‌పాత్‌లపైయ కూర్చొని చిరు వ్యాపారాలు చేసుకునే వీధి వ్యాపారుల జీవితాలు ఒక్కసారిగా కుదేలయ్యాయి, ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వం స్పందించి వీధి వ్యాపారులను ఆదుకునేందుకు ప్రధానమంత్రి స్వనిధి (ఆత్మనిర్భర్) పథకాన్ని ప్రవేశపెట్టి చేయూతనిచ్చింది. పట్టణ పేదల నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో సర్వే చేయించి, అర్హులైన చిరు వ్యాపారులను గుర్తించి వారికి గుర్తింపు పత్రాలిచ్చారు. ఎంపిక చేసిన వారికి మొదటి, రెండో విడతల్లో రుణసాయం అందించి ఆదుకుంది.

990 మంది గుర్తింపు

హాలియా మున్సిపాలిటీలో మొత్తం 990మందిని వీధి వ్యాపారులున్నట్లు గుర్తించి వారికి గుర్తింపు పత్రాలు ఇచ్చారు. చిరు వ్యాపారుల ఉపాధిని మెరుగు పరిచేందుకు ఆత్మనిర్భర్ పథకం కింద మొదటి విడతగా రూ. 10వేలు అందించారు. నగదు తీసుకున్న వారు సకాలంలో చెల్లిస్తే రెండో విడతలో రూ. 20వేలు ఇచ్చారు. తాజాగా కేంద్ర ప్రభుత్వ ప్రకటనలో ఈ రుణ పరిమితి రూ. లక్ష వరకు పెరగనుంది.

రెండో విడత రుణం తీసుకున్నా



కరోనా కాలంలో పండ్ల వ్యాపారం పూర్తిగా కుదేలై అప్పు పుట్టలేదు. దీంతో పురపాలిక ద్వారా రుణాలిస్తున్నారని తెలిసి దరఖాస్తు చేసుకున్నా. రూ. 10వేల సాయం అందించారు. ఇచ్చిన రుణాన్ని చెల్లించా. రెండో విడత మళ్లీ రుణం తీసుకుని నా వ్యాపారాన్ని మరింతగా పెంచుకున్నా.

– ఎస్‌కె చంద్‌పాషా, పండ్ల వ్యాపారి, హాలియా

వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటా



ఆత్మనిర్భర్ పథకం కింద సెలూన్ షాపు వ్యాపారానికి రెండు విడతల్లో రుణం తీసుకున్నా. మార్చి నుంచి రుణం పెంచి ఇస్తారని తెలిసింది. మేము చెల్లించిన దాని బట్టి రూ. 50వేల నుంచి రూ. లక్ష వరకు రుణమిస్తారని అంటున్నారు. అలాగైతే నా సెలూన్ షాపును మరింతగా విస్తరించి వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటా.

– అనుముల పరమేష్, సెలూన్ షాపు, హాలియా

సద్వినియోగం చేసుకోవాలి



మున్సిపాలిటీలోని చిరు వ్యాపారులకు మెప్మా ద్వారా అందించే ఆర్థిక సాయాన్ని వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి. వ్యాపార ప్రగతికి ఓ నిచ్చెనగా చేసుకొని ఆర్థిక దిశగా ఎదగాలి. ఏప్రిల్ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరంలో రుణ పరిమితి పెరగనుంది. వీధి వ్యాపారాలు తమ వ్యాపారాలను పెంచుకుని ప్రభుత్వం ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలి.

– కందిమల్ల వీరారెడ్డి, మున్సిపల్ కమిషనర్, హాలియా

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ నంబర్ వన్

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ : సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం నంబర్ వన్‌గా నిలిచిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చింతపల్లి మండలానికి చెందిన 29మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుండి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. మహిళా సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తూ పెద్ద పీట వేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల ద్వారా పేదింటి ఆడబిడ్డల వివాహానికి ప్రభుత్వం రూ.1లక్ష అందిస్తూ కొండంత భరోసా కల్పిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ కంకణాల ప్రవీణవెంకట్‌రెడ్డి, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, కుంభం శ్రీశైలం, కొండల్, గిరి, జగన్, కృష్ణ పాల్గొన్నారు.

19న సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

ఈనెల 19న దేవరకొండలో గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే రవీంద్రకుమార్ తెలిపారు. గురువారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సేవాలాల్ జయంతి వేడుకలను నిర్వహిస్తుందన్నారు. ఇందుకు గాను దేవరకొండ నియోజకవర్గానికి రూ.3.60లక్షలు మంజూరైనట్లు తెలిపారు. గిరిజనులను జాగృతం చేసి వారిని చైతన్య పర్చిన గొప్ప మహనీయుడు సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ అని అన్నారు. స్వరాష్ట్రంలో గిరిజనులు వికాసం సాధించాలన్న గొప్ప సంకల్పంతో గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేన్నారు. ఈ సమావేశంలో దేవరకొండ ఇన్‌చార్జ్ ఆర్డీఓ లీల, గిరిజన సంఘం అధ్యక్షుడు కేతావత్ లక్ష్మణ్ నాయక్ , చందర్ నాయక్, శ్రీనునాయక్, పాపానాయక్, సర్దార్ నాయక్, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి

నిడమనూరు : పాఠశాలలోని ఏర్పాటు చేసిన లైబ్రరీని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టబోయిన అనిల్‌కుమార్ గురువారం అన్నారు. మండలంలోని ముప్పారం జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం విద్యార్థులు స్వపరిపాలనా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా వ్యవహరించారు. ఈసందర్భంగా పాఠశాలకు వెళ్లిన అనిల్‌కుమార్ తాను ఆరేళ్ల కిందట రూ. 25వేలతో పాఠశాలలో ఏర్పాటుచేసిన లైబ్రరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, టీచర్లు శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, కృష్ణమూర్తి, నాగార్జున, లింగప్ప, కోటేష్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం

- ఎమ్మెల్యే భాస్కర్‌రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. గురువారం దామరచర్ల మండల కేంద్రంలోని రైతువేదికలో మండల వ్యాప్తంగా 145మందికి మంజూరైన 1,45,16,820 విలువగల చెక్కులను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. పేదింటి ఆడబిడ్డల వివాహ సమయంలో ఆర్థికంగా ఇబ్బందులు పడవద్దనే గొప్ప సంకల్పంతో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాన్ని తీసుకొచ్చి రూ.లక్ష అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వీర్లపాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రూపావత్ చందు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పార్టీ నుంచి మంజూరైన బీమా రూ.2లక్షల చెక్కును కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చెన్నయ్య, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జిల్లా రైతుబంధు సమితి సభ్యులు కుందూరు వీరకోటిరెడ్డి, జెడ్పీటీసీ లలిత హాతీరాంనాయక్, ఎంపీపీ ధీరావత్ నందినిరవితేజ, నాయకులు యూసుఫ్, నాగుల్‌మీరా, వెంకటేశ్వర్లు, పెదకోటిరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి కృషి

మండలంలోని ముల్కలకాల్వ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ కోదండ రామాలయ ఆలయ నిర్మాణానికి తనవంతుగా కృషిచేస్తానని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. గురువారం కోదండ రామాలయ నిర్మాణానికి రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డితో కలిసి భూమి పూజ నిర్వహించి ఆయన మాట్లాడారు. దేవాలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ నూకల సరళ, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ ధనావత్ చిట్టిబాబునాయక్, పీఏసీఎస్ చైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు మట్టపల్లి సైదయ్యయాదవ్, పూసపాటి రాజయ్య, సర్పంచ్ రాజు, మాజీ ఎంపీటీసీ రవి పాల్గొన్నారు.

వార్డుల్లో పర్యటిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ

- హాలియా మున్సిపాలిటీలో పర్యటించిన ఎమ్మెల్యే భగత్
- సమస్యలు పరిష్కరిస్తానని హామీ


హాలియా : కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నోముల భగత్


పెద్దవూరలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భగత్

హాలియా : ఎమ్మెల్యే నోముల భగత్ హాలియా మున్సిపాలిటీ పరిధిలోని 7, 8, 9వ వార్డుల్లో గురువారం ఉదయం కాలినడకననడుస్తూ వార్డులోని ప్రజలను పలకరిస్తూ సమస్యలు తెలసుకున్నాడు. కొంత మంది కాలనీ వాసులు కాలనీలో తమకు సొంత ఇళ్లు లేక కొన్నేళ్లుగా పూరిగుడిసెలో నివాసం ఉంటున్నామని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, తాగునీటి వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే మున్సిపల్ చైర్‌పర్సన్, సభ్యులు కూడా వార్డులో పర్యటించాలన్నారు. సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని, ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం ఏడో వార్డులోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ‘మన ఊరు–మన బడి’ కార్యక్రమం లో భాగంగా జరుగుతున్న పనులను ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే 7, 9 వార్డులో నివాసం ఉన్న పిట్టల ఈదయ్య, బోనగిరి సైదులు, కొల్లి సూరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆ బాధిత కుటుంబాల ఇంటికెళ్లి ఆ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. మృతిచెందిన వారికి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరవ సలహాదారు వెంపటి శంకరయ్య, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి యనమల సత్యం, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు చెరుపల్లి ముత్యాలు, దోరేపల్లి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ ప్రసాద్ నాయక్, కోఆప్షన్ సభ్యుడు రావుల లింగయ్య, డెరెక్టర్లు సురబి రాంబాబు, నాయకులు జింకల ప్రసాద్, దుర్గారావు, మురళి, యూత్ అధ్యక్షుడు సైదాచారి, చెన్నయ్య, బందిలి చిన సైదులు, కిషన్, హనుమంతు, మోతీలాల్, దుర్గయ్య, ఎర్రయ్య, శ్రీను, సతీష్, సైదులు, ఈదయ్య, కృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

పెద్దవూర : రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మల్లిఖార్జున ఫంక్షన్ హాల్లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 150మంది లబ్ధిదారులకు రూ.1.50 కోట్ల విలువైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. అనంతరం అనారోగ్య సమస్యలతో కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న నిరుపేద కుటుంబాలకు చెందిన 22మందికి రూ.8.03 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సైతం పంపిణీ చేశారు. మండల తహసీల్దార్ సురిగి సైదులుగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జువ్వాజి వెంకటేశ్వర్లు, నాయకులు కర్ణ బ్రహ్మారెడ్డి, రవినాయక్, బోయ నరేందర్‌రెడ్డి, రామలింగయ్య, ఎస్‌కే బషీర్, మెండె సైదులు, కర్నాటి మునిరెడ్డి, సర్పంచ్‌లు దండ మనోహర్‌రెడ్డి, విష్ణుప్రియా, కొండయ్య, మల్లారెడ్డి, శ్రీను, బాలయ్య, కిషన్, రాజేష్, శ్రీకర్, శివాజీ, పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

గుర్రంపోడు : మండలంలోని జూనూతుల గ్రామంలో 17మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే భగత్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నారెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయ, మండల పార్టీ ఉపాధ్యక్షుడు రవి, మండల నాయకుడు ఇంద్రారెడ్డి, సర్పంచ్‌లు భాస్కర్, నాగరాజు, దశ్రునాయక్, మాజీ సర్పంచ్ వెంకటయ్య, యూత్ అధ్యక్షుడు కుప్ప పృధ్వీ రాజ్, నాయకులు నగేష్, మర్ల రమేష్, మారపాక వెంకటయ్య, కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి


ఉద్యోగులు, కార్మికులతో మాట్లాడుతున్న ఆర్ఎం

దేవరకొండ : ఆర్టీసీ ఉద్యోగులు సమష్టిగా పనిచేస్తూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా రీజనల్ మేనేజర్(ఆర్ఎం)శ్రీదేవి అన్నారు. గురువారం దేవరకొండ ఆర్టీసీ డిపోను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డిపో కార్యాలయంలో రికార్డులు, గ్యారేజ్, దేవరకొండ, కొండమల్లేపల్లి బస్‌స్టేషన్‌లను ఆమె తనిఖీ చేశారు. అనంతరం దేవరకొండ డిపోలో సంస్థ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డిపోను జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్క ఉద్యోగి కృషి చేయాలన్నారు. ప్రతి రోజు బస్సుకు రూ.1000 చొప్పున అదనపు ఆదాయం వచ్చే విధంగా పని చేస్తే డిపోకు అదనంగా రూ.1లక్షకు పైగా ఆదాయం సమకూరుతుందని ఆమె పేర్కొన్నారు. అదే విధంగా ఉద్యోగుల ఆరోగ్యం విషయంలో కూడా సంస్థ ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట డిపో మేనేజర్ రాజీవ్ ప్రేమ్‌కుమార్, డీవీఎం శివశంకర్, లావణ్య, భారతీబాయి పాల్గొన్నారు.

‘ఆర్టీఐఏ పేరుతో బెదిరింపులు’

మిర్యాలగూడ : సమాచార హక్కు చట్టం (ఆర్టీఐఏ) పేరుతో రుషికేశ్వర్‌రాజు బెదిరింపులకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకులు ఐల వెంకన్న, సర్పంచ్ బారెడ్డి అశోక్‌రెడ్డి, దోరెపల్లి లింగయ్య, కుర్ర ప్రవీణ్‌లు ఆరోపించారు. గురువారం వారు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ పట్టణంలోని రవీంద్రనగర్ కాలనీలో సర్వే నంబర్ 211లో శ్రీకాకుల రాంబాబు నుంచి 2017లో ఐదు గుంటల భూమిని కొనుగోలు చేశామని తెలిపారు. తొలుత సరికొండ కృష్ణవేణి పేరుతో 847గజాలు ఉందని అందులో రెండు గుంటలు ఆము అనే గిరిజనుడు 2016లో కృష్ణవేణి నుంచి కొనుగోలు చేశారని మిగిలిన 5గుంటలను తాము కొనుగోలు చేశామన్నారు. సరికొండ కృష్ణవేణి నుంచి గుండా శ్రవణ్‌కుమార్ 2013లో కొనుగోలు చేశాడని అతడు శ్రీకాకుల రాంబాబుకు అమ్మగా అతడి వద్దనుంచి తాము కొనుగోలు చేశామని తెలిపారు. ఇప్పుడు రుషికేశ్వర్‌రాజు ఆ భూమి తనదంటూ తమపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. తమకు అనుకూలంగా హైకోర్టు నుంచి తీర్పు వచ్చే అవకాశం ఉండడంతో రుషికేశ్వర్ రాజు తమపై దాడులు చేస్తున్నారన్నారు. పోలీసులు సమగ్ర విచారణ జరిపించి రుషికేశ్వర్‌రాజుపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

గ్రామీణ క్రీడలకు అధిక ప్రాధాన్యం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

పెద్దవూర : గ్రామీణ క్రీడలకు తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని, అందుకే ప్రతి గ్రామంలో క్రీడా మైదానాలను ఏర్పాటు చేస్తుందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని చింతపల్లి గ్రామంలో శ్రీశ్రీ దున్న ఇద్దాస్ ఆరాధనమహోత్సవాల్లో భాగంగా ఫ్లడ్ లైట్ల వెలుతురులో మ్యాట్‌పై నిర్వహిస్తున్న జాతీయ స్థాయి మహిళ కబడ్డీ పోటీలకు గురువారం రాత్రి ఆయన హాజరై మాట్లాడారు. మారుమూల గ్రామంలో ఫ్లడ్ వెలుతురులో ప్రోకబడ్డీ మాదిరి జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలను నిర్వహించి, మహిళల క్రీడా అభ్యున్నతికి కృషి చేస్తున్న అబ్బాస్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ షేక్ అబ్బాస్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చెన్ను అనురాధ సుందర్‌రెడ్డి, వెనిగండ్ల పీఏసీఎస్ చైర్మన్ కేవీ రామారావు, మన్నెం రంజిత్‌యాదవ్, యడవెల్లి దిలీప్‌రెడ్డి, గార్లపాటి శేఖర్, పాండురంగారెడ్డి, క్రీడల కన్వీనర్ షేక్ అబ్బాస్, సర్పంచ్ ప్రభావతిసంజీవరెడ్డి, భారతికొండల్, శంకర్, భూలోకరావు, కర్తయ్య పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, పింఛన్లు, పోడు భూముల పట్టాలు అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం దామరచర్లలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 76 సంవత్సరాలు పూర్తయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు పూర్తిస్థాయిలో ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వలేకపోవడం దురదృష్టకరమన్నారు. ఇళ్ల స్థలాలు ఉన్నవారికి ప్రభుత్వం రూ.3లక్షలు ఇస్తామంది కానీ.. ప్రస్తుత ధరలకు అనుగుణంగా రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. మండల కేంద్రంలో వందల ఎకరాల ప్రభుత్వ, దేవాదాయ భూములు ఉన్నాయని, వాటిని నిరుపేద కుటుంబాలకు అందించాలని కోరారు. లేనిపక్షంలో పేదలను సమీకరించి ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష కూడా చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, మండల కార్యదర్శి మాలోతు వినోద్‌నాయక్, సీనియర్ నాయకులు పాపానాయక్, దయానంద్, సుబాని, కోటిరెడ్డి, ఎర్రనాయక్, గోపి, శ్రీను, సోమయ్య పాల్గొన్నారు.

ఓట్లను అమ్ముకోవడం మహాపాపం



మాట్లాడుతున్న విశారదన్ మహారాజ్

గుర్రంపోడు : ఓట్లను అమ్ముకోవడం మహాపాపమని, ఓటును నమ్ముకుని బీసీ, ఎస్సీ, ఎస్టీల స్వరాజ్యాన్ని సాధించుకుందామని డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా. విశారదన్ మహారాజ్ అన్నారు. గురువారం రాత్రి మండలంలోని చేపూరు, గుర్రంపోడు, కొప్పోలు గ్రామాలకు పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర చేరుకుంది. ఈ సందర్భగా ఆయా గ్రామాల్లో జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు. ‘ఓట్లను అమ్ముకుని బానిసలుగా ఉందామా, మన ఓట్లను మనమే వేసుకుని పాలకులమవుదామా’ అని ఆయన ప్రశ్నించారు. దేశంలో అత్యధిక జనాభా, ఓట్లు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకే రాజ్యాధికారం రావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా కార్యదర్శి జగన్, మండల అధ్యక్షుడు శంకర్, నాగర్జున, యాదగిరి, మహేష్, వెంకటేష్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

హాలియా : సంత్ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆలిండియా బంజారా సేవా సంఘం, లంబాడీ హక్కుల పోరాట సమితి, గిరిజన విద్యార్థి సంఘం , ప్రజా సమాఖ్య సంఘం, ఉద్యోగాల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను జయప్రదం చేసేందుకు బంజారా సంఘం నాయకుల ఆధ్వర్యంలో గురువారం హాలియాలోని విశ్రాంత అతిథి గృహంలో రౌండ్ టెబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా బంజారా సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బిక్షా నాయక్, ప్రధాన కార్యదర్శి రవినాయక్, కార్యదర్శి రవినాయక్, కోశాధికారి సక్రూనాయక్, నాయకులు మునినాయక్, దగడ్‌బాలు తదితరులు ఉన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదికలో సర్పంచ్‌ల వాగ్వాదం


ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గుర్రంపోడు : అంతంత మాత్రంగా నిధులు మంజూరు.. ఆపై తక్కువ అంచనాలు, కఠినమైన నిబంధనలున్న ఉపాధిహామీ పనులతో తాము అప్పుల పాలవుతున్నామని సర్పంచ్‌లు అధికారులతో వాగ్వాదానికి దిగారు. మూడు సంవత్సరాల్లో నిర్వహించిన ఉపాధి హామీ రూ.18 కోట్ల పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ బృందం నివేదికపై ప్రజావేదిక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్ తమకు వివిధ పనులకు సంబంధించి నిధులు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిది నెలలుగా నర్సరీ నిర్వహణ నిధులు ఇవ్వడం లేదన్నారు. క్రీడా ప్రాంగణాలకు అయ్యే స్టీలుకు కిలో రూ.60 నిర్ణయించగా మార్కెట్‌లో రూ.80 ఉందని, ఇది సర్పంచ్‌ల పాలిట భారంగా మారిందని గుర్రంపోడు సర్పంచ్ షేక్ మస్రత్ సయ్యద్‌మియా ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు తక్కువగా వచ్చి తాము నష్టపోతున్నామని సర్పంచ్‌లు జగదీశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలు ఆవేదన వ్యక్తం చేశారు. రికార్డుల్లో సాంకేతికపరమైన లోపాలు, అదనపు చెల్లింపులు, సంతకాలు లేకపోవడం వంటి లోపాలు మొదటి రోజు పదిగ్రామ పంచాయతీల్లో నిర్వహించిన పనులపై నివేదికలో బయటపడ్డాయి. కంపోస్టు షెడ్డులకు నిర్వహించిన చెల్లింపుల్లో తేడాలను గుర్తించారు. సమావేశంలో అడిషనల్ ప్రాజెక్టు అధికారి శైలజ, ఎంపీడీఓ సుధాకర్, అంబుడ్స్‌మన్ మహ్మద్ గోరీ, ఫసియుద్దీన్, ఉపేందర్ రెడ్డి, ఏపీఓ గోపాల్‌రెడ్డి, ఈసీ లింగయ్య, , ఎస్ఆర్పీ గంగరాజు, రమేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు సొంత భవనం నిర్మించాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ : దామరచర్ల మండల కేంద్రంలో గిరిజన బాలుర గురుకుల పాఠశాలకు సొంత భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర సైదానాయక్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు వినోద్‌నాయక్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. పలుమార్లు అధికారులకు వినతిపత్రం అందించినా పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనునాయక్, మండల కార్యదర్శి వీరన్న, జగన్ నాయక్, అజయ్, రమేష్, తరుణ్ పాల్గొన్నారు.